నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

శుక్రవారం 3 నవంబర్ 2023 | FRIDAY, NOVEMBER 3, 2023 | RANGAREDDY | పేజీలు PAGES : 12


# సొంత గూటికి దేశమళ్ల

## సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ పార్టీలో చేరిన కాంగ్రెస్ నేత దేశమళ్ల ఆంజనేయులు



సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకుడు దేశమళ్ల ఆంజనేయులు, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు..

షాబాద్, నవంబర్ 2: చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉద్యమ నేత దేశమళ్ల ఆంజనేయులు గురువారం సొంత గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రగతిభవన్‌కు ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి వెళ్లి సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2001నుంచి పార్టీ అధినేత కేసీఆర్ వెంట తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన 2018లో కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీలో తగిన గుర్తింపు లభించకపోవడంతో తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం పనిచేయాలని, పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని సీఎం తనతో చెప్పినట్లు ఆంజనేయులు తెలిపారు.

# మన బడి.. వసతుల ఒడి..

మన ఊరు మన బడి



- ఫలితాన్నిస్తున్న మన ఊరు-మన బడి కార్యక్రమం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- అందుబాటులోకి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు
- జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో 468 స్కూళ్లలో పనులు
- 65 బడుల్లో పూర్తయిన పనులు.. ప్రారంభం

సెంటర్ స్ప్రెడ్‌లో..

**'మన ఊరు-మన బడి'తో** ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల పనులు పూర్తి కాగా, కొన్ని స్కూళ్లలో వివిధ దశల్లో పనులు సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఇంగ్లీష్ మీడియంలో బోధనను ప్రవేశపెట్టడంతోపాటు భవనాలకు మరమ్మతులు, అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ల నిర్మాణం, పెయింటింగ్, ప్రహరీలు, తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలో మొదటి విడుతలో 468 పాఠశాలలు ఎంపికకాగా.. 448 పాఠశాలలకు రూ.97.88కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులను ఇచ్చింది. ఇప్పటివరకు 65 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

-రంగారెడ్డి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ)



'మన ఊరు-మన బడి' తో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయి. డ్యూయల్ డెస్క్‌లు, హ్యాండ్‌వాష్‌లు, మరుగుదొడ్లు, డైనింగ్ హాళ్లు తదితర వసతులు సమకూరుతున్నాయి.

**బడుల్లో సకల వసతులు సమకూరాయి..**

దీంతో చాలామంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యమైన విద్యనందించి వంద శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

-నరేంద్ర బోగం, హెచ్‌ఎం, కందవాడ ప్రాథమిక పాఠశాల, చేవెళ్ల



డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

# నేటి నుంచి నామినేషన్ల పర్వం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 10వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ దాఖలు చేసుకునేందుకు ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు

6



ఇబ్రహీంపట్నం రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో ఏర్పాట్లను ఆర్డీవోను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ భారతి హోళీకేరీ..

ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి షురూ కానున్నది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల ఈనెల 10 వరకు కొనసాగనుండగా.. అభ్యర్థులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, వాహనాలను అంతకుమించి లోపలికి తీసుకురాకూడదని పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో ఐదుగురికి మాత్రమే లోనికి ప్రవేశముంటుందని, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. మరోవైపు ఆయా పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ముహూర్తాలను చూసుకుంటున్నారు.

-రంగారెడ్డి, నవంబర్ 2(నమస్తే తెలంగాణ)



గాంధీ భవన్ ఎదుట అనుచరులతో కలిసి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేత దండెం రాంరెడ్డి

# కాంగ్రెస్‌పై దండెత్తిన 'దండెం'

- బీఫామ్ ఇవ్వకపోతే తన దమ్మేందో చూపిస్తానన్న కాంగ్రెస్ నేత దండెం రాంరెడ్డి
- గాంధీ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ధర్నా, కార్యాలయానికి తాళం..
- రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీల దహనం.. కాంగ్రెస్‌ను వీడని గ్రూపు తగాదాలు..

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2 : కాంగ్రెస్‌ను గ్రూపు తగాదాలు ఇంకా వీడడం లేదు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ టికెట్ కేటాయింపుపై వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నది. టికెట్‌కోసం తీవ్రంగా ప్రయత్నించి విసుగుచెందిన కాంగ్రెస్ సీనియర్ నేత దండెం రాంరెడ్డి ఆందోళనను తీవ్రతరం చేశారు. గురువారం తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌కు తాళం వేసి కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అక్కడున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను చింపివేసి దహనం చేశారు. ఈ సందర్భంగా దండెం రాంరెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్రహీంపట్నం టికెట్ తనకే కేటాయిస్తానని రేవంత్‌రెడ్డి తనతో పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెట్టించారన్నారు. తనకు కాకుండా మూడుసార్లు పోటీచేసి ఓడిపోయిన మల్‌రెడ్డి రంగారెడ్డికి టికెట్ కేటాయించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పునరాలోచించి.. బీఫామ్ తమకే ఇవ్వాలని, లేని పక్షంలో రెబల్‌గా పోటీ చేసి తన దమ్మేంటో చూపిస్తానని అధిష్టానానికి అల్టిమేటం జారీచేశారు.

# రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికాదు

- రాజకీయ దురుద్దేశంతోనే అర్థంలేని ఆరోపణలు
- మూడేండ్ల క్రితం చనిపోయిన రైతు కుటుంబం ఇప్పుడు గుర్తుకొచ్చిందా?
- బాధిత కుటుంబానికి రైతుబీమా అందింది.. పింఛనూ ఇస్తున్నాం..
- కుట్ర రాజకీయాలు చేస్తే ప్రజలు సహించరు : ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

7

